# మనోరంజితం - 12

స్కూలు నుండి వచ్చిన వసుధ  బ్యాగు ఒకచోట పెట్టేసి... అలిగినట్లుగా మొహం ముడుచుకుని కూర్చోవటం చూసి, మహిమ కంగారు పడిరది. ఏమైందంటూ ఆరాతీసింది. అయినా అలాగే

ఉండటంతో రెండు మూడు సార్లు రెట్టించి అడిగినా ఫలితం లేకపోయేసరికి దగ్గరకు తీసుకుని ‘‘ఏదైనా నాకు చెప్పకపోతే... ఎలా తెలుస్తుందమ్మా... నువ్వలా ఉంటే... నాకెంత దిగులుగా ఉంటుందో, నీకు తెలియదా...?’’ అంది.

మహిమ ఒడిలో తలదాచుకుని ‘‘అమ్మా...’’ అంటూ వసుధ ఏడుపు మొదలుపెట్టేసరికి, కంగారు పడుతూ ‘‘ఏడవకు... విషయం చెప్పుముందు...’’ అంటూ బుజ్జగించింది మహిమ.

‘‘అమ్మా... స్కూల్లో నా పక్కనే కూర్చునే నా ఫ్రెండు గీత ఏం చెప్పిందోతెలుసునా... వాళ్ళింట్లోవాళ్ళందరికీ రంజిత్ వీడియోలు అంటే బాగా ఇష్టమట... ఏది విడుదల అయినా వెంటనే చూసేస్తారు.... ఆ తర్వాత నాకు వర్ణించి వర్ణించిచెబుతూంటుంది. ఈ వేళ ఇంకో విషయం కూడా చెప్పింది. ఆ రంజిత్ అనే ఆయన ఒక చిన్న పాప కలిగించిన స్ఫూర్తితో తాగుడు వ్యసనం మానెయ్యాలనే నిర్ణయానికి వచ్చి... అలాగే చేయగలిగాడట! అప్పటినుండీ... ఆ వ్యసనం కలిగించే అనర్థాల గురించి ప్రచారం చేయాలనే అభిప్రాయంతోనే వీడియోలు తీస్తున్నాడనీ, అవన్నీ తన చిన్నారికే అంకితమనీప్రకటించారట. గీత వాళ్ళమ్మ... చిన్నారి అంటే... ఆయన కూతురే అయివుంటుందీ, లేకపోతే అంత ప్రేమ చూపించడులే అందని నాతో చెప్పింది...!’’

ఒక నిముషం నిశ్శబ్దంగా ఉండిపోవటంతో మహిమ ‘‘ఇందులో నువ్వు బాధపడటానికి ఏముందీ...? ఆ వీడియోలు చూడాలనిపిస్తే... చూద్దాం... అంతేగా...!’’ అంది కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ.

వసుధ వెక్కిళ్ళు ఆపుకుని మెల్లగా అంది ‘‘మరి... నేను.... నేను కూడా నాన్నకి రమ్మనమని

ఉత్తరం రాసానా... నాన్నకి నేనంటే ఇంకా కోపం పోలేదు కాబోలు, రానూలేదూ, జవాబూ రాయలేదు! ఎవరో... ఆ చిన్నారంటే... వాళ్ళ నాన్నకి అంత ఇష్టం...! మరి... మా నాన్నకి... నేనంటే... అస్సలు...’’ వసుధకు మళ్ళీ ఏడుపు వచ్చేసింది.

మహిమ వసుధను విస్మయంగా చూసింది. ‘‘నువ్వు... వసూ... నువ్వు నాన్నకి ఉత్తరం రాసావా... ఎపుడు... ఎలా....?’’ అడిగింది.

వసుధ తండ్రికి ఉత్తరం రాసిందన్న వార్త కలిగించిన దిగ్భ్రాంతి నుండి మహిమ పూర్తిగా బయటపడలేదు. వసూకితండ్రిపట్ల అంత ఇష్టం ఎలా వచ్చింది...? తెగతెంపులు చేసుకున్న తండ్రిపట్ల మమకారం ఉండటం సాధ్యమేనా... రోజూ కనుపిస్తూ... గారం  చేసే తండ్రిపట్ల ఇష్టం ఉండటంలో ఆశ్చర్యం లేదు...! కానీ తనని దూరంపెట్టి... భయపెట్టిన తండ్రి పట్ల వసుధకు అంత ఆపేక్ష కలగటం... నిజంగా ఆశ్చర్యమే... అనుకుంది.

‘‘అమ్మా....’’ బిగుసుకుపోయినట్లుగా ఉన్న తల్లిని చేయపట్టి కదుపుతూ అంది వసుధ.

''నీ హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న కార్డు ఎవరిదని ఒకసారి అడిగితే, నువ్వు... నాన్న ఫ్రెండుదనిచెప్పావుగా, ఏమైనా సాయం కావాలంటే ఫోను చేయమని ఇచ్చారనీఅన్నావుగా, అందుకని... నేనే ఆ నెంబర్‌కు ఫోను చేసి వెంకట్ గారిని నాన్న అడ్రసు తెలుసునా అనడిగితే చెప్పారు. అలా రాసానన్నమాట! నాన్న దగ్గర్నుండి జవాబు వచ్చినా, నాన్నే వచ్చినా... నీకు సర్‌ప్రైజ్‌గా ఉంటుందని ముందుగా చెప్పలేదమ్మా... సారీ...'' అంది... తల్లి కళ్ళల్లోకి చూస్తూ.

''మనల్ని వదిలి దూరంగా వెళ్ళిపోయిన నాన్న... ఎందుకు కావాలనిపించిందివసూ..?'' మహిమ గొంతు బొంగురుపోయింది కూడా.

''నాన్న గురించి... నువ్వే కదమ్మా... రోజూ చెప్పేదానివి... నాన్నకి ఆ అలవాటు లేకపోతే, చాలా మంచివారని కూడా అన్నావుకదా... పైగా నేను నిద్రపోయాక కూడా నాన్న గురించి చాలా కబుర్లు చెప్పేదానివి కూడా... నాకు పూర్తిగా నిద్రపట్టకపోతేనో, లేక వెంటనే మెలకువ వచ్చేసినపుడో... నీలో నువ్వు చెప్పుకుంటున్నట్లుగా... అవీ, అపుడపుడూవిన్నాగా... అందుకే... నాన్నంటే భయం, కోపం పోయి... నాకూ ఇష్టం వచ్చి... ఉత్తరం రాయాలనిపించి...'' మళ్ళీ తండ్రి దగ్గర్నుండిజవాబేమీ రాలేదనే విషయం గుర్తుకు వచ్చి కాబోలు... వసుధ ఏడుపు మొదలు పెట్టింది.

''ఊరుకోవసూ... నీకో సర్‌ప్రైజ్ ఇద్దామని... నేను నువ్వు స్కూలు నుండి ఎపుడు వస్తావాఅనిఎదురుచూస్తూ... వచ్చాక చెబుదామనుకుంటే... నువ్వు రాగానే ఏడుపు మొదలు పెట్టావు. దాంతో నేను అసలు విషయం మర్చిపోయాను... మనిద్దరం రెండు రోజుల్లో... ఊరు వెళ్తున్నాం. బెర్తులు రిజర్వ్ చేయించేసాను ఈ వేళే... తెలుసా...?''

వసుధ ఉత్సాహంగా ప్రశ్నలు మొదలు పెట్టేసింది.

''ఏ ఊరు అమ్మా... బంధువులింటికా... మనం ఎపుడైనా వెళ్ళామా...?''

''హైద్రాబాద్...'' అనిముక్తసరిగా జవాబు చెప్పి వూరుకుంది మహిమ. వసుధ వదిలిపెట్టకుండా ''అలా ఒక్క ప్రశ్నకే జవాబు చెప్పి వూరుకుంటే ఎలా అమ్మా... ఎగ్జామ్స్‌లో జవాబు తెలిసీ రాయకుండా ఉంటే... నువ్వు కోప్పడతావుగా, మరి ఇపుడు... అన్ని ప్రశ్నలకూ జవాబులు చెప్పవేం... నాకూ కోపం రాదూ...?'' అంటూ తల్లిని నవ్వించే ప్రయత్నం చేసింది.

మహిమ పెదవుల పైకి చిరునవ్వు వచ్చింది.

''సరే... సరే... అలాగే చెబుతాలే...! నువ్వు ఇపుడు... ఎవరి గురించి బాధపడ్డావో... అక్కడికే...''

''నిజంగా...?!'' వసుధ కళ్ళు పెద్దవి చేసి చూస్తూ అడిగింది.

''అవును... చూశావా... నీ మనసులోని కోరిక నాకెలాతెలిసిపోయిందో...!'' తమాషాగా అంది మహిమ.

''నాన్న దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది కదూ...? ఎవరికి రాసారు... నీకా... నాకా... ముందుగా ఎందుకు చెప్పలేదూ...?'' బుంగమూతి పెట్టింది.

''మీ నాన్నకి ఉత్తరం రాసావని... నాకు ఇన్నాళ్ళ తర్వాత, ఇపుడు అదీ మీ ఫ్రెండు ఏదో అంటే... గుర్తుకు వచ్చి చెప్పావు. నేను టికెట్స్ బుక్ చేసిన ఈ రోజే నీకు చెప్పానుగా...!'' అంది మహిమ.

''అవును... నువ్వు మంచి అమ్మవి...'' అంటూ మహిమ చెంపలపై ముద్దులు పెట్టింది వసుధ. మహిమ నిట్టూర్చి వూరుకుంది. వసుధ ఇంకా ఏవో సందేహాలు అడగబోతోంటే... ''ఆ వివరాలన్నీ తర్వాత...'' అని తేల్చేసి వూరుకుంది.

వసుధ కూడా సరే అన్నట్లు మౌనం వహించింది.

* * *

అంతకు రెండు రోజుల ముందు... మనోరమా వాళ్ళు మహిమ ఇంటికి వచ్చారు. అప్పటికి వసుధ ఇంకా ఇంటికి రాలేదు. హైద్రాబాద్‌లో డి ఆడిక్షన్ సెంటర్ నుండి ఉత్తరం వచ్చిన సంగతి చెప్పారు.

అక్కడ... శిక్షణా కార్యక్రమంలో భాగంగా... వ్యసనం బారినపడి, విముక్తికోసం చేరినవాళ్ళ తల్లిదండ్రులు, బంధువులు లేదా ఆత్మీయులతో సమావేశాలు అపుడపుడూ ఏర్పాటు చేయటం

ఉంటుంది. తమ వాళ్ళు ఎలా ఆ అలవాటుకు లోనయ్యారో, ఎలాంటి సమస్యలతో తాము ఇబ్బంది పడ్డారో లాంటి అనుభవాలను పంచుకుంటే, అందరికీ ప్రయోజనకరమైన విషయాలు తెలుస్తాయని ఆ సమావేశాల ఉద్దేశ్యం.

అభిరామ్ చాల నాళ్ళనుండి... ఆ అలవాటు నుండి విముక్తి పొందాడనీ, అయినా ఎన్నాళ్ళు అలా నిలకడగా ఉండగలనో అక్కడే ఉండి పరీక్షించుకుంటూ, పదిమందికీ ఉపయోగపడే కార్యక్రమాలూ నిర్వహిస్తున్నాడని నిర్వాహకులు తెలియజేస్తూనే... కోరిక ఉంటే, అక్కడకు వచ్చి సమావేశంలో పాల్గొనమని ఆహ్వానిస్తున్నామని తెలియజేశారు.

అభిరామ్ చెప్పటం వలనే తల్లిదండ్రుల, మహిమ పేరన ఆహ్వానాలు పంపటం జరిగిందనీ తెలియజేశారు.

ఆ విషయం వాళ్ళు చెప్పి వెళ్ళిన దగ్గర్నుండీ మహిమలో మథన ప్రారంభం అయింది. మనోరమా వాళ్ళకు ఏ విషయమూ వెంటనే చెప్పకుండా ఆలోచిస్తానని మాత్రం అన్నది. బాగా ఆలోచించిన మీదట మహిమకు అనిపించింది... అతని నుండి విడాకులు పొందినా, మానసికంగా మాత్రం తమ బంధం బీటలు వారకుండా బిగుసుకునే ఉందని! అందుకే వెళ్ళాలనే నిశ్చయానికి వచ్చి రిజర్వేషను చేయించుకుని... ఆవిషయం మనోరమకూ తెలియజేసింది.

సరిగ్గా ఆ రోజే వసుధ ఉత్తరం రాసిన సంగతి తెలియటం మహిమకు విచిత్రంగా తోచింది!

అభిరామ్‌లోనూ ఆతృత పెరిగిపోతోంది. అక్కడకు.... తనవాళ్ళుఎవరు వస్తారు....? ఖచ్చితంగా వచ్చేది మాత్రం తల్లేననితెలుసుగానీ... మిగతావారి విషయంలోనే సందిగ్ధత...!

మహిమ వస్తే బావుండుననే ఆశ మనసులో రెపరెపలాడుతోంది గానీ, ఎందుకు వస్తుందనే ఆలోచనతో కృంగిపోతోంది అతని మనసు.

తనని ప్రేమించి... పెద్దవాళ్ళ అభ్యంతరాలను తోసిపుచ్చి... తనతో జీవితం పంచుకున్న మహిమను ఎంతగా క్షోభ పెట్టాడో... అపుడు తెలుసుకోలేకపోయాడు... ఇక్కడకు వచ్చాకనే, ఆ వ్యసనం నుండి బయటపడ్డాకనేతెలిసివచ్చింది!

చేజారినాకనే... విలువ తెలుస్తుందంటారు! అవును... అది నిజమే...! మహిమతో విడిపోయాకనే... తను కోల్పోయిన కుటుంబ జీవితం విలువ తెలిసింది! తల్లీతండ్రీ... తను

నిలకడగా ఉంటాడని నమ్మలేదు... తనతో అనుభవించిన కష్టాలు అటువంటివి మరి...! నమ్మిన మహిమకు ఆశాభంగమే కదా కలిగిందీ...!

మందుకు అలవాటు పడిన వాళ్ళ లక్షణం... ఎవరినీ లెక్క చేయకుండా... ఎటువంటి హీన పరిస్థితి కయినాదిగజారిపోవటం...! మితిమీరిన తాగుడుతో హోటల్ గదిలో పడివున్న తనను బిల్ కట్టి... ఇంటికి తీసుకువెళ్ళటానికి వచ్చిన తండ్రి కోపంతో హెచ్చరించినందుకు... ఎంత రభస చేశాడో గుర్తు తెచ్చుకుంటుంటే... అభిరామ్ తల సిగ్గుతో వంగిపోయింది. బిల్లు పేచేసిస్పృహలేని స్థితిలో

ఉన్న తనను తీసుకెళ్ళమని హోటల్ వాళ్ళనుండి ఫోను వచ్చినపుడు... తండ్రి ఎంత కృంగిపోయివుంటాడో... ఇపుడర్థం అవుతోంది గానీ, అపుడు మాత్రం పట్టించుకోలేదు...!

అలా అందర్నీ బాధపెట్టినందుకు... ఇపుడు ఒంటరి తనపు శిక్ష అనుభవించాల్సిందే...!

గత జీవితాన్ని నెమరేసుకుంటూ ఆలోచనలకు ముగింపు పలికాడు అభిరామ్.

* * *

మరునాడు... మహిమ వెంకట్‌కు ఫోను చేసి... వసూకి అభిరామ్ అడ్రసు ఇచ్చిన విషయం తనకెందుకు తెలియజేయలేదూఅని ఆరాతీసింది.

మీరే అడగమన్నారనుకున్నానని జవాబు చెప్పాడతను. ''పోనీలెండి... మీకు తెలియకుండానే మీ పాప తన తండ్రికి ఉత్తరం రాసి చాలా మంచిపనే చేసింది. ఆ ఉత్తరమే అభిరామ్‌లోని మార్పుకు కారణమైంది.... మామూలు మనిషీ కాగలిగాడు...'' అని, ''మీకు అభిరామ్ అమ్మగారు మనోరమ గారి ద్వారా అన్ని విషయాలూ తెలుస్తూంటాయని అనుకుంటున్నానే...!'' అన్నాడు.

అన్ని విషయాలూ తెలియటం అంటే ఏమిటి....? అభిరామ్ మళ్ళా పెళ్ళి చేసుకున్నాడా...? మహిమకు అనుమానం వచ్చింది. అడగటానికి కొంచెం మొహమాటం అనిపించినా, ఆగలేక అడిగేసింది. వెంకట్ చిన్నగా నవ్వాడు.

''పెళ్ళి గురించి కాదు. అలాంటిదేమీ జరిగినట్లు లేదు. జరిగితే, మాకు తెలియకుండా

ఉంటుందనుకోను. రంజిత్ పేరుతో అభిరామ్ తీస్తున్న షార్ట్ ఫిల్మ్‌లకు ఎంతటి ఆదరణ లభిస్తోందో... పేరు ఎంత ప్రాచుర్యం పొందిందోనని... ఇవన్నీ మీకూ తెలిసేవుంటాయనుకున్నా...!''

''నిజమా...?!'' అంటూ ఒక క్షణం ఆశ్చర్యానికి లోనైన మహిమ తర్వాత మెల్లగా అంది.

''మీ కొలీగ్స్ ఇద్దరు ముగ్గురు ఆ వీడియోల గురించి మాట్లాడారు. నాకు అభిరామే, రంజిత్ పేరుతో తీస్తున్నారని తెలియదు... అత్తయ్యవాళ్ళు వచ్చినపుడు... ఆ సమయంలో వసు ఉంటే, తనతోనే ఎక్కువగా మాట్లాడుతూంటారు. ఒకసారి మాత్రం... ఏదో చెప్పబోతూ 'బంధమే లేకుండా పోయినపుడు... ఆ విషయాలెందుకులే...' అన్నారు. అంటే... అభిరామ్ గురించేనని అనుకున్నా గానీ నేనూ తరిచి అడగలేదు...!'' అంది మహిమ.

అతను మహిమ గురించి వివరాలడిగితే స్కూలు నుండి మరో దానిలోకి మారానని, ఆ ఉద్యోగం బావుందనీ.... క్లుప్తంగా చెప్పి ఫోన్ సంభాషణ ముగించింది.

* * *

ఆరోజు... వసుధ స్కూలు నుండి వచ్చాక... ''నిన్న... మనం ఊరుకువెళ్తున్నామనిచెప్పాకదా, అక్కడే షార్ట్ ఫిల్మ్స్ తీసే రంజిత్ కూడా ఉంటున్నారనే విషయం తెలిసింది. మనమూకలుద్దామా...?'' అనడిగింది మహిమ.

వసుధ చాలా ఉత్సాహపడుతుందని మహిమ ఊహించింది. తన ఫ్రెండ్స్ అంతా రంజిత్ వీడియోల గురించి చాలా గొప్పగా చెప్పుకుంటూ ఉంటారని ఎన్నోసార్లు చెప్పింది మరి!

అయితే వసుధ మాత్రం... ''నాన్నని కలవాలనే నాకు ఆత్రుతగా ఉంది! నాకిపుడుభయంలేదనీ, ఇంటికి వచ్చెయ్యమనిఅడుగుతా. మనమందరం చక్కగా కలిసి వుంటేబావుంటుందికదమ్మా...!'' అంది.

మహిమకు ఒక అనుమానం వచ్చింది. తనవలనే తండ్రి ఉద్యోగమంటూ దూరంగా వెళ్ళి పోయాడనే అనుమానంతో గిల్టీగా బాధపడుతోందా....? అందుకే తిరిగిరమ్మని అడుగుతోందా...?

అదే మాట అడిగింది.

కాదన్నట్లుగా తల వూపింది వసుధ.

''నాన్న కూడా మనతో ఉంటే... బావుంటుంది కదా... అందుకనే.... నిన్ను అడగకుండా ఉత్తరం రాసాను... అమ్మా... నాన్నంటే, నీకు చాలా ఇష్టమని... నీ మాటలవల్లేగా నాకూ తెలిసిందీ...!''

తల్లి ఏం మాట్లాడకుండా ఆలోచనలో పడి వున్నట్లనిపించి... ''అమ్మా... నేను తప్పు చేశానా...?'' అనడిగింది వసుధ.

''లేదమ్మా... లేదు... నువ్వు చాలా మంచి పనే చేశావు... నీకు తెలియకుండానే గొప్ప పని చేయగలిగావు...!'' గొణుగుతున్నట్లుగాఅంటూ వసుధను రెండు చేతులతో దగ్గరకు తీసకుని గుండెలకు హత్తుకుంది.

తల్లి మాటలు పూర్తిగా అర్థం కాకపోయినా, వసుధ ఏం ప్రశ్నలు వేయకుండా అలాగే చూస్తూ నిలబడిపోయింది.

మహిమ తెప్పరిల్లి, కళ్ళు తుడిచేసుకునిమామూలైపోయింది. ''సరే, పద... మనం బట్టలవీ ప్రయాణానికి సర్దుకోవాలా... చాలా పనులున్నాయి...!'' అంది చిరునవ్వుతో.

* * *

అభిరామ్ ఎంతో ఆతృతగా ఎదురుచూసిన రోజు రానే వచ్చింది.

అప్పటికి ఎన్నోసార్లు... అక్కడున్న వాళ్ళ తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు... ఇలా చాలామందే వచ్చి తమవాళ్ళ గురించి మాట్లాడటం అతను వినే ఉన్నాడు. ఆరోజు... తన వాళ్ళు... ఎవరు వస్తారు...? ఏం చెబుతారు...? ఇదే ఆలోచనతో... తెల్లవారింది...!

అయితే... అతను ఎంత ఆరాటపడుతున్నాడో... అంత ఆలశ్యం అయిందారోజు. కంగారులో ఒక కుర్రాడిని ఢీ కొట్టడంతో... అతను క్రిందపడ్డాడు. గాయాలు చిన్నవే అయినా, వెంట ఉండి పరిచర్యలు చేసి, అతనిని విశ్రాంతిగా గదిలో పడుకోబెట్టాకగానీ, అభిరామ్‌కు స్థిమితం కుదరలేదు.

అప్పుడు... హడావుడిగా సమావేశం జరిగే హాలుకి వస్తూంటే... అతనికి చిరపరిచితుమైన గొంతు గంభీరంగా వినపడి... ఆశ్చర్యంతో కదలలేని వాడిలా బిగుసుకుపోయి... ఆగిపోయాడు. వెనువెంటనే... అతనికి తండ్రి కూడా వచ్చాడని అర్థమైంది!

ఆనందోత్సాహంతో... ఆరాటంతో లోపలకు వచ్చి ఎవరికీ కనపడని విధంగా... ముందు కూర్చున్నవాళ్ళని అడ్డం చేసుకుని కూర్చుని... ఒళ్ళంతా చెవులు చేసుకున్నాడు.

''మా అబ్బాయిదే తప్పని నాకు అనిపించదు... నా వల్లా పొరపాట్లు జరిగాయి! తల్లిదండ్రులు... బిడ్డల పట్ల మితిమీరిన ప్రేమాభిమానాలతో, తమకు తెలియకుండానే ఒక్కోసారి వాళ్ళ అభివృద్ధికి ఆటంకంగా నిలబడటమూ జరుగుతూ ఉంటుందనిపిస్తోంది...?

మావాడి పట్ల మేం అదే చేశాం! వాడు... చిన్న వయసులోనే, ఒక నాటిక రాసి,ప్రదర్శింపచేసినపుడు... తోటి విద్యార్థులు, లెక్చరర్స్ అందరూ ప్రశంసించారు. ఆ ప్రశంసలకు తనో తెలివైన ప్రత్యేకమైన వ్యక్తిననే భావంతో అహంకారాన్ని పెంచుకున్నాడు. అది గమనించినా, వాళ్ళమ్మ కన్న ప్రేమతో అది మంచిది కాదని చెప్పలేక పోయింది! ఆ అహం ఇంకా ఇంకా పెరిగేలా తనూ ప్రశంసలతో ముంచెత్తింది కూడా!

పిల్లలు తప్పుచేస్తే తల్లిదండ్రులు దండిరచాలి! అలాగే వాళ్ళు కష్టపడి సాధించిన విజయాలకు ప్రశంసించాలి...! ఇది నావల్ల జరిగిన తప్పు. వాడి విజయాలను ప్రశంసించకపోయినా... తప్పులను మాత్రం వేలెత్తి చూపి దండిస్తున్నానని... మా అభిరామ్ నన్నొక తండ్రిగా కాకుండా కఠినాత్ముడిగా మాత్రమే గుర్తించాడు... దాంతో నాపట్ల నిరసన చూపిస్తూ నిర్లక్ష్యాన్ని పెంచుకున్నాడు! మరి... నేనేనాడూ తండ్రిలా ప్రేమగా దగ్గరకు తీసుకోలేదుగానీ, క్రమశిక్షణ పేరుతో దూరంగా మాత్రం పెట్టాను...!

ఇది... నాకు... తెలిసే జరిగిన విషయం. మీకొక ఉదాహరణతో వివరిస్తాను. కొడుకు చూపించిన తెలివితేటలకు మురిపెంతో తండ్రి కొడుక్కి ఓ స్వీటు తినిపించాలని కొడుకు దగ్గరకు వచ్చినపుడు... ఆ కొడుకు తల్లి ఒడిలో కూర్చుని... అప్పటికే చాలా తిని, ఇక తినలేని స్థితిలో ఉండటం చూసి... తీపి అంత ఎక్కువగా తినటమనేది ఆరోగ్యానికి మంచిది కాదని మందలించి వెనుదిరగటం జరుగుతుంది!

మా అబ్బాయి విషయంలో జరిగింది ఇదే...! అర్థమైందనుకుంటాను!

ప్రశంస కూడా తీపి మిఠాయిలాంటిదే...! ప్రశంస అనేది పన్నీటిచిలకరింపులా ఉండాలని అంటారు. అపుడే పులకింత కలిగిస్తుంది...! మితిమీరి వెల్లువెత్తితే, ముంచేస్తుంది...! మొదటికే మోసం తెస్తుంది! తలకెక్కిన అహం... పతనానికి దారితీస్తుంది...!

పార్టీల పేరుతో మా వాడు మందుకు అలవాటు పడినపుడు ఆందోళన చెందానేగానీ ఏం చేయాలో తోచలేదు. తల్లిదండ్రుల అలవాట్లే పిల్లలకూ వస్తాయని నమ్మినవాడిని. నేనెపుడూ ఏ దురలవాటుకూలోనవలేదు. క్రమశిక్షణను నిత్యమూ కవచంలా ధరించినవాడిని. మరి... నా కొడుకు ఎందుకు పెడదారి పట్టాడు...? నా ప్రవర్తన మంచి పాఠంలా ఉపయోగపడలేదెందుకూ...! అర్థమయ్యేది కాదు...!

వృత్తి జీవితంలో... ఎవరికీ నావైపువేలెత్తి చూపటానికి అవకాశం ఇవ్వకుండా మచ్చ అనేది లేకుండా నా ధర్మాన్ని నిర్వర్తించాను! వ్యక్తిగత జీవితంలో మాత్రం ఓడిపోయాను.

కొడుకు... మందు మత్తులో యాక్సిడెంట్ చేసి... హాస్పిటల్ లో ఉన్నాడని కబురు వస్తే... ఆ తండ్రి పరిస్థితి... మానసిక స్థితి ఎలా ఉంటుంది...? వాడికి ఎదురైన ఆపద గురించి దిగులు ఉన్నా... అవమాన భారంతో... వాడి ప్రవర్తనకు... కోపంతో రెచ్చిపోయాను! నాకేమీ సంబంధం లేదని చీదరించుకున్నానుగానీ... హాస్పటల్‌కి వెళ్ళి చూడకుండావుండలేకపోయాను...!''

ఆ సన్నివేశం గుర్తుకు వచ్చింది కాబోలు, నిరంజన్‌రావుకళ్ళ నుండి నీళ్ళు ధారకట్టాయి.